ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 26 మే 2025





మహానాడు ప్రాంగణంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి సవిత, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, రితేష్ రెడ్డి

మహానాడుకు సర్వం సిద్ధం

- దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తి
- నేడు మంత్రి నారా లోకేశ్ రాక
- 5 వేల మంది పోలీసులతో పహారా
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రుల బృందం

(కడప-ఆంధ్రజ్యోతి): రాయలసీమ నడిబొడ్డు కడప గడపలో నిర్వహించనున్న మహానాడుకు సర్వం సిద్ధమైంది. మహావేదిక దాదాపు పూర్తయింది. చిత్తూరు - కడప - కర్నూలు జాతీయ రహదారి కడప శివార్లలోని రింగు రోడ్డు పక్కనే ఇటు బహిరంగసభ, అటు వాహనాల పార్కింగ్ అన్నీ బాగా ఈ వేదికకు కలిసి వచ్చాయి. పదిరోజుల క్రితం ఈ ఏరియా అంతా మొక్కలతో నిండి ఉండేది. అయితే ఆదివారం నాటికి అది ఓ సిటీనే తలపించే విధంగా తయారైంది. రేపటి నుంచి మూడు రోజుల పాటు మహానాడు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారాలోకేశ్ సోమవారం ఉదయం 9 గంటలకు కుప్పంలో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు మహానాడు వేదిక వద్దకు చేరుకోనున్నారు.

సర్వం సిద్ధం

2004 నుంచి 2019 వరకు కడప జిల్లావాసులు వైఎస్ ఫ్యామిలీకి అండగా ఉన్నారు. 2004-09 ఎన్నికల్లో అప్పటి వైఎస్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ జైకొడితే 2014-19 ఎన్నికల్లో జగన్ నేతృత్వంలోని వైసీపీకి జనం మెజార్టీ సీట్లను కట్టబెట్టారు. అయితే 2024లో సీన్ రివర్స్ అయి ఉమ్మడి జిల్లాలో 10 స్థానాలకు గాను 7 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. మహానాడును ఈసారి రాయలసీమలో నిర్వహించాలనుకుంటుండగా కడప బెస్ట్ అని నిర్ణయించారు. ఇప్పటి వరకు నిర్వహించిన మహానాడులో వేదిక ఒకచోట, వాహనాల పార్కింగ్ ఇంకోచోట ఉండేది. అయితే ఇప్పుడు ఒకేచోట ప్రతినిధుల సభ, బహిరంగసభ ఆ పక్కనే వాహనాల పార్కింగ్ స్థలం పక్కనే ఉంది. టీడీపీ మహానాడు చరిత్రలోనే ఇంత అద్భుతమైన ప్రదేశం దొరకలేదని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటిస్తూ వచ్చారు. బహిరంగసభ జరిగే పక్కనే పార్కింగ్ ఉంది.

5 వేల మంది పోలీసులతో బందోబస్తు

మహానాడు సందర్భంగా అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. 5 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లాకు సంబంధించి 15 చోట్ల అన్ని జిల్లాల బార్డర్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, మహానాడు వేదిక భద్రతకు 15 మంది ఐపీఎస్ అధికారులు, 30 మంది అడిషనల్ ఎస్పీలు, 60 మంది డీఎస్పీ స్థాయి, 200 మంది సీఐలు ఎస్ఐలు బందోబస్తులో ఉంటారన్నారు. ట్రాఫిక్, పార్కింగ్‌లకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.న 120 కెమెరాలతో మహానాడు ప్రాంగణాన్ని పర్యవేక్షిస్తామని, అత్యాధునిక డ్రోన్స్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు సంబంధించి 13 చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేకంగా డైవర్షన్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



మహానాడు వేదిక ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మాధవి, మాజీ మంత్రి దేవినేని ఉమా, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



పనులను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పట్టాభి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు


పనులన్నీ దాదాపు పూర్తి

మహానాడుకు సంబంధించి కీలకమైన నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. 27, 28 తేదీల్లో రెండు రోజులు ప్రతినిధుల సభ జరగనుంది. ఇందుకోసం వేదిక దాదాపు పూర్తయింది. వేదిక 164 అడుగులు వెడల్పు, 500 అడుగుల పొడవుతో ఏర్పాటు చేసిన వేదికపై సుమారు 400 మందికి పైగా కూర్చోవచ్చు. కింద 20 వేల మంది వరకు కూర్చోవచ్చు. ఇక భోజనశాలకు సంబంధించి వీవీఐపీల కోసం 80 అడుగుల వెడల్పు 100 అడుగుల పొడవు, డెలిగేట్స్ కోసం వంద అడుగుల వెడల్పు, 200 అడుగుల పొడవు చొప్పున రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. చివరిరోజు ఐదు లక్షల మందితో బహిరంగసభ నిర్వహించనున్నారు. ఇందుకోసం వేదికనే 120 మీటర్ల వెడల్పుల 80 అడుగుల పొడవుతో నిర్మించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ మహానాడు ప్రాంగణంలోనే బస చేయనున్నారు. ప్రాంగణాన్ని 1200 అడుగుల పొడవు, 600 అడుగుల వెడల్పుతో నిర్మించారు. 32 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. దాదాపు కేవలం సీటింగ్ కోసమే 3 లక్షల మంది వరకు కూర్చోనున్నారు. చుట్టుపక్కల స్టాండింగ్ కోసం స్థలం ఏర్పాటు చేశారు. అంటే ఐదు లక్షలమంది ఉండే విధంగా చూశారు.



భోజన వసతి పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తదితరులు

వర్షంతో పనులకు ఆటంకం



మహానాడు ప్రాంగణంలో కురుస్తున్న వర్షం

ఆదివారం సాయంత్రం కడప నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో పనులకు అంతరాయం ఏర్పడింది. మహానాడు ప్రాంగణమంతా బురదమయంగా మారింది. బహిరంగసభ జరిగే వేదిక వద్దకు కూడా వర్షం నీరు వచ్చింది. దీంతో మంత్రి నిమ్మల రామానాయుడు వేదికను పరిశీలించి వర్షం ఆగిపోయిన వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు.

నభూతోనభవిష్యత్తు

- మంత్రి అచ్చెన్నాయుడు

కడప మహానాడును నభూతో నభవిష్యత్‌గా నిర్వహిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కడపలో మహానాడుకు ఇంత మంచి గ్రౌండ్ దొరకడం ఆనందంగా ఉంది. మహానాడులో పార్టీ పటిష్టత, సంస్థాగత సభతో పాటు రాష్ట్రాభివృద్ధిపై చర్చ నడుస్తుంది. నారా లోకేశ్ పాదయాత్రలో భాగంగా రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. మహానాడులో సీమ కోసం ఏం చేయాలో వెల్లడిస్తారు. మహానాడును అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే ఆర్.మాధవి తెలిపారు. మహానాడుకు దాదాపు 50 వేల మంది ప్రతినిధులు హాజరవుతారని అందరికీ భోజన ఏర్పాట్లు చేశామని స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభి వెల్లడించారు. మహానాడులో పారిశుధ్యంకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మహానాడు సందర్భంగా మహానాడు కోసం వచ్చే నేతలు, కార్యకర్తలు, ప్రజల కోసం ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను మంత్రి బీసీ జనార్థనరెడ్డి పరిశీలించారు. పులివెందుల రోడ్డు, కర్నూలురోడ్డు, బద్వేలు రోడ్డులో భోజన ఏర్పాట్ల కేంద్రాలు పరిశీలించారు. మహానాడులో పారిశుధ్యంపై కార్మిక శాఖ మంత్రి సుభాష్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాంగణాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, కొల్లురవీంద్ర తదితరులు పరిశీలించారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మహానాడుపై వసతి, బహిరంగసభపై మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కొల్లురవీంద్ర, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాజేంద్ర, రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొని చర్చించారు. మహానాడులో కీలకమైన డెలిగేట్ సభ వేదిక దాదాపు పూర్తయింది. బహిరంగసభ కూడా పూర్తి కావచ్చింది.సీఎం బస, సీఎంవో ఆఫీసు, రక్తదాన శిబిరం, భోజనశాల ఇలా అన్నీ పూర్తికావచ్చాయి.



ఎమ్మెల్యేలు, మంత్రులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కార్మిక సమస్యలను పరిష్కరిస్తాం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ కార్మిక శాఖ మంత్రి సుభాష్

మదనపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): ఏపీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. ఆదివారం మదనపల్లెలోని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు ఆహ్వానం మేరకు నీరుగట్టువారిపల్లెలోని చినబాబు నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఏపీలో కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం పాలన చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో కార్మికులే కాదు..అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. అలాగే యువత టీడీపీని ముందుకు నడిపించడానికి అష్టకష్టాలు పడి, ఐదేళ్ల తర్వాత వైసీపీకి 11 సీట్లు మాత్రమే దక్కేవిధంగా పోరాడిందన్నారు. ఇందులో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో శ్రీరాంచినబాబు కూడా అనే ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నారని మంత్రి కొనియాడారు. ముఖ్యంగా రాష్ట్రంలో మాలాంటి యువతను మంత్రి నారా లోకేశ్ ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మహానాడు ప్రతిష్మాత్మకంగా కడపలో నిర్వహించడం, 40 ఏళ్ల చరిత్రలో మహానాడుతో కడప అంతా పసుపుమయం కాబోతుందన్నారు. అందరం కూడా చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు మాట్లాడుతూ మా అన్నలాంటి మంత్రి మా స్వగృహానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కడపలో నిర్వహించే మహానాడుకు బెంగళూరు నుంచి మదనపల్లె మీదుగా వెళుతూ మా ఆహ్వానం మేరకు ఇక్కడికి వచ్చారని తెలిపారు. గతంలోనూ మంత్రి కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించారని కొనియాడారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామినాయుడు, తెలుగు యువత నాయకులు నాదేళ్ల అరుణ్‌కుమార్, జి.యోగేశ్వరబాబు, చేనేత కార్మిక సంఘం నాయకుడు మోడెం నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



సంతానం కోసం వరపడుతున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో అలంకరించి పూజలను చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసరును తాగి ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా యోగా కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల

మదనపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): మెగా యోగ ఈనెల 28వ తేదీ నిర్వహించనున్నామని ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. స్థానిక బెంగళూరు రోడ్డులో ఆదివారం అధికారులతో కలిసి బీటీ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఈనెల 28న ఇక్కడ నిర్వహించనున్న మెగా యోగా కార్యక్రమ నిర్వహణపై ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైదానంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. యోగా చేయడానికి అనుగుణంగా మైదానంలో మ్యాప్ ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. శిక్షకులు చెప్పే యోగా ఆసనం అందరికీ వినపడేలా మైక్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, హెల్పర్లు, ఏఎన్ఎంలు, మెడికల్ అధికారులు, ఆశా కార్యకర్తలు క్రమశిక్షణతో సంఘటితంగా కార్యక్రమం విజయవంతం చేసేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనుంజయులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- రూ.10,500 విలువైన గంజాయి స్వాధీనం

మదనపల్లె టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం నక్కలదిన్నె వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఎక్సైజ్ పోలీసుల బృందం అరెస్టు చేసింది. బీఎంపీపీ సీఐ సత్యశ్రీనివాస్ కథనం మేరకు.. విశ్వసనీయ సమాచారంతో ఆదివారం ఉదయం నక్కలదిన్నె ప్రాంతంలోని ఓ గుజిరి దుకాణం వద్ద మదనపల్లె ఎక్సైజ్ పోలీసులు, బీఎంపీపీ పోలీసులు, రాయచోటి ఈఎస్‌టీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ద్విచక్రవాహనంలో గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు గుర్తించి వారిని పట్టుకునేందుకు వెళ్లగా ఓ నిందితుడు పరారయ్యాడు. మిగిలిన నలుగురు నిందితులు ఎస్.మహ్మద్‌బాషా (22), సయ్యద్ సద్దాం (35) బి.దినకర్ (21), పి.సాయిప్రసాద్ (25)లను అరెస్టు చేశారు. పారిపోయిన మోషే అలియాస్ బన్ను మీద కూడా కేసు నమోదు చేశారు. దాడుల్లో రూ.10,500 విలువైన 2.1 కిలోల గంజాయితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

నిందితుడు పరారీకి యత్నం

మదనపల్లె పట్టణంలో పట్టుబడ్డ గంజాయి కేసులో నిందితుడైన ఓ వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన పోలీసులు పారిపోతున్న నిందితుడిని తిరిగి అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి వారికి వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించేందుకు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఓవైపు వీరికి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తుండగా సాయిప్రసాద్ అనే నిందితుడు అక్కడి నుంచి పరుగెత్తాడు. ఇది గమనించి ప్రభుత్వాస్పత్రి సెక్యూరిటీ గార్డు రమేశ్‌తో పాటు ఎక్సైజ్ పోలీసులు అతడిని గేటు వద్ద అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ భీమలింగ నలుగురు నిందితులకు ఎస్కార్ట్‌గా వెళ్లిన ఐదుగురు ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సహాయంగా మరో నలుగురు కానిస్టేబుళ్లను పంపి జాగ్రత్తగా నిందితులను కోర్టులో హాజరు పరిచారు.



గంజాయి విక్రేతల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె నుంచి 12 వేల మంది

- 20 నియోజకవర్గాల నుంచి 5 లక్షల మంది హాజరు కావాలి
- పరిశీలకుడు భాష్యం ప్రవీణ్

మదనపల్లె టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించనున్న మహానాడుకు మదనపల్లె నుంచి 10 నుంచి 12 వేల మంది, కడప చుట్టుపక్కల ఉన్న 20 నియోజకవర్గాల నుంచి 5 లక్షల మంది టీడీపీ కార్యకర్తలు హాజరయ్యేలా చర్యలు చేపట్టామని మదనపల్లె నియోజకవర్గ మహానాడు పరిశీలకుడు, పెద్దకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఆదివారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గం నుంచి కడప మహానాడుకు 10 వేల నుంచి 12 వేల మంది టీడీపీ కార్యకర్తలను తరలించాలన్నారు. దీనికోసం నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల వారిగా టీడీపీ కార్యకర్తలను తరలించడానికి బూత్ ఇన్‌చార్జిలను నియమిస్తున్నామన్నారు. వీరు బాధ్యతగా వ్యవహరించి ఈనెల 29వ తేదీ జరిగే మహానాడు బహిరంగసభకు ప్రతి టీడీపీ కార్యకర్త వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గం నుంచి 250కిపైగా బస్సులను ఏర్పాటు చేస్తున్నామని, మహానాడు విజయవంతానికి కృషి చేసిన టీడీపీ నాయకులకు పార్టీ అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు మాట్లాడుతూ గతంలో దూర ప్రాంతాల్లో మహానాడు జరిగినా మదనపల్లె నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ కార్యకర్తలు హాజరయ్యేవారని, ఇప్పుడు దగ్గరలోని కడప మహానాడుకు నియోజకవర్గం నుంచి వేలాదిమందిగా టీడీపీ కార్యకర్తలు హాజరవుతారన్నారు. సమావేశంలో టౌన్ బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జె.భవానీప్రసాద్, సీనియర్ నాయకులు మోడెం సిద్దప్ప, నీలకంఠ, దొరస్వామినాయుడు, బాలుస్వామి, షంషీర్, మూడు మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిశీలకుడు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పక్కన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, శ్రీరాంచినబాబు

విజ్ఞానం... వినోదం...

- చిన్నారుల్లో సృజనకు బీజం...వేసవి శిక్షణ శిబిరం
- కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు పేరుతో పీలేరు గ్రంథాలయంలో చిన్నారులకు శిక్షణ

పీలేరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా పుస్తకాలు, హోం వర్కులు, అసైన్‌మెంట్లతో సిగపట్లు పడుతూ, కేజీల కొద్దీ స్కూల్ బ్యాగులు మోస్తూ అలసిపోయిన చిన్నారి హృదయాలకు వేసవి సెలవులు పెద్ద ఉపశమనం. అందుకే వేసవి సెలవులు ఎప్పుడెప్పుడు వస్తాయా అంటూ చిన్నారులు ఎదురుచూస్తూ ఉంటారు. ఆ సెలవుల్లో అమ్మమ్మ, నానమ్మ ఊళ్లకు వెళ్లి నెల రోజులపాటు హాయిగా గడపవచ్చునని వారి ఆశ. అయితే సెల్‌ఫోన్లు, టీవీల కారణంగా చిన్నారుల దైనందిన అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగా అవే వేసవి సెలవులు వారికి పెద్ద శాపంలా మారవచ్చునంటున్నారు మానసిక శాస్త్ర నిపుణులు. అప్పటి వరకు పుస్తకాల నడుమ గడిపిన వారు సెలవుల్లో దొరికిన విరామాన్ని సెల్‌ఫోన్లు, టీవీలకు అలవాటుపడితే పెద్దప్రమాదమే పొంచి ఉందని వారు హెచ్చరిస్తున్నారు. పిల్లలు వాటికి అలవాటుపడకుండా వారిని డ్రాయింగ్, డ్యాన్స్, చెస్, కథలు రాయడం, కథలు వినడం వంటి అనేక సృజనాత్మక కళలు, క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని వారు సూచిస్తున్నారు. పెద్దపెద్ద పట్టణాల్లో అయితే అనేక సంస్థలు వేసవి సెలవుల్లో ప్రత్యేకంగా పిల్లల కోసం అనేక రంగాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంటాయి. చిన్న చిన్న గ్రామాల నుంచి ఓ మోస్తరు పట్టణాల్లో అటువంటి సౌకర్యం ఉండదు. కానీ జిల్లా గ్రంథాలయ సంస్థ 'వేసవి విజ్ఞాన తరగతులు' పేరుతో చిన్నారుల కోసం ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తోంది. గ్రంథాలయం ఉన్న ప్రతి ఊరిలోనూ ఈ శిబిరాలను ఏర్పాటు చేసింది. ఆ క్రమంలో పీలేరులోని పద్మావతి నగర్‌లో ఉన్న శాఖా గ్రంథాలయంలోనూ చిన్నారులకు క్యారమ్స్, చెస్, శాస్త్రీయ సంగీతం, డ్రాయింగ్, పుస్తక పఠనం, కథలు చెప్పడం, కథలు రాయడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వేసవి సెలవులలో విద్యార్థులు, చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఉపయోగపడతాయని పలువురు ఉపాధ్యాయులు సైతం బలపరుస్తున్నారు. పీలేరులోని గ్రంథాలయంలో ప్రస్తుతం 25 మంది చిన్నారులు ప్రతిరోజూ అనేక అంశాల్లో శిక్షణ పొందుతున్నారు.

జూన్ 6 వరకు విజ్ఞాన తరగతులు

వేసవి సెలవులు ఈ ఏడాది ఏప్రిల్ మాసం చివరి నాటి నుంచి మొదలయ్యాయి. అయితే గ్రంథాలయ సంస్థ ఆ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు తమ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా పీలేరు గ్రంథాలయంలో ప్రస్తుతం చిన్నారులకు డ్రాయింగ్, చెస్, క్యారెమ్స్, సంగీతం, శాస్త్రీయ నృత్యం, కబడ్డీ, కథలు రాయడం, కథలు చెప్పడం వంటి అనేక అంశాల్లో ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు స్థానిక గ్రంథాలయాధికారి అమరనాథ్. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటలు వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కొంతమంది చిన్నారులు సాయంత్రం పూట కూడా వస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో కూడా పట్టు సాధించాలన్న తపనతో పలువురు ప్రభుత్వ ఇంగ్లిష్ ఉపాధ్యాయులను సంప్రదించి పాఠాలు చెప్పిస్తున్నారు. ఎటువంటి రుసుము లేకుండా కేవలం విద్యార్థుల సంపూర్ణ వికాస అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వేసవి విజ్ఞాన తరగతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. పెద్దపెద్ద పట్టణాల్లో పెద్ద మొత్తాల్లో ఫీజులు వసూలు చేసి నేర్పే అనేక అంశాలను మేము ఆయా రంగాల్లో నిష్ణాతుల ద్వారా ఉచితంగా బోధిస్తున్నాం. ఏడాది పొడవునా పుస్తకాలతో పోటీపడే చిన్నారులు వేసవి సెలవుల్లో తమలో దాగి ఉన్న సృజనాత్మకతను తెలుసుకునేందుకు వేసవి శిబిరం ఉపయోగపడుతుంది. తద్వారా విద్యార్థి జీవితంలో ఉండే ఒత్తిడి చాలా వరకు తగ్గుతుంది.

- అమరనాథ్, గ్రంథాలయాధికారి, పీలేరు


పుస్తక పఠనంలో చిన్నారులు


గ్రంథాలయంలో యోగా నేర్చుకుంటున్న చిన్నారులు


చెస్, క్యారెమ్స్ నేర్చుకుంటున్న చిన్నారులు

పేర్ని నానీ.. తైతక్కలాడే పద్ధతి మానుకో..

- లిక్కర్ స్కామ్‌లో జగన్ అరెస్టయితే నీ గతేంటో..
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కడప మారుతీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీని ప్రజలు ఛీత్కరించుకున్నప్పటికీ పిచ్చిపిచ్చి ప్రేలాపనలాడుతున్న పేర్ని నాని తైతక్కలాడే పద్ధతి మానుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హితవు పలికారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడు ముసుగులో కడపలో దగానాడు సభలను నిర్వహిస్తున్నారని పేర్ని నాని నోరు పారేసుకోవడం సరైంది కాదన్నారు. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లన్నీ గుంతలమయం చేశారన్నారు. ఎక్కడైనా ఒక్కటంటే ఒక్క తట్ట మట్టి కూడా పోయలేని దుస్థితిలో పాలన సాగించారన్నారు. క్రమశిక్షణకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని, కనుకనే ఆత్మాభిమానం చంపుకోలేక వైసీపీని వీడానన్నారు. మహిళలంటే చంద్రబాబుకు ఎనలేని గౌరవమని, కనుకనే బియ్యం అక్రమ రవాణాలో నీ భార్య అడ్డంగా దొరికినా సాక్ష్యాధారాలు దొరికే వరకూ ఇబ్బంది పెట్టకూడదన్న మంచి మనసున్న నాయకుడు చంద్రబాబు అన్నారు. లిక్కర్ స్కామ్‌లో జగన్ జైలుకెళ్లబోతున్నారని, అప్పుడు నీ గతేంటో చూస్తామన్నారు. సమావేశంలో టీడీపీ మీడియా జనరల్‌సెక్రటరీ జనార్ధన్ పాల్గొన్నారు.

మహానాడు విజయవంతం అవుతుంది

- పులివెందుల నియోజకవర్గం నుంచి 20వేల మంది
- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, బీటెక్ రవి




వేంపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న మహానాడు విజయవంతం అవుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మహానాడు ఏర్పాట్లలో భాగంగా పులివెందులకు వచ్చిన ఆయన వేంపల్లె ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో రాయలసీమ జిల్లాల్లో టీడీపీపై ప్రజలు ఎనలేని అభిమానం చూపించారని, అందుకు కృతజ్ఞతగానే కడపలో మహానాడును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదావరి-బనకచెర్ల ప్రాజెక్టుతో రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం నుంచి ప్రస్తుతానికి 15వేల మంది నుంచి 20వేల వరకు మహానాడుకు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మహానాడు : మంత్రి సుభాష్



సీకేదిన్నె, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడును స్వచ్ఛ మహానాడుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మహానాడును విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ తుది దశకు చేరుకున్నాయన్నారు. స్వచ్ఛ మహానాడుగా నిర్వహించడంలో వలంటీర్లు, ఐటీడీపీ చాంపియన్లు కీలకపాత్ర వహించాలన్నారు. వచ్చిన ప్రతినిధులకు అవసరమైన టాయిలెట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, ఎక్కడ ఎటువంటి చిన్న వాటర్ బాటిల్ కూడా కనిపించకుండా పరిశుభ్రంగా ఉంచాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రతినిధుల సమావేశ ప్రాంగణం ముందు 50 టాయిలెట్స్, మీడియా సెంటర్‌లో 10, వీవీఐపికి 10, కమాండ్ కంట్రోల్, సీఎం బస వద్ద, వంటశాల వద్ద ఏడు, పార్కింగ్ ఏరియాల్లో 150 టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత పట్టాభి, గోవవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 17.2 టీఎంసీల నీరు



కొండాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో 17.235 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతూ వస్తోంది. ఎండాకాలం కావడం, ప్రాజెక్టు నుండి అనుబంధ రిజర్వాయర్లకు నీరు విడుదల చేస్తుండటంతో నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా సర్వరాయసాగర్‌కు 250 క్యూసెక్కులు, తాగునీటి స్కీమ్‌కు 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో ఏమి లేదని తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటిసామర్థ్యం 26.85 టీఎంసీలు.

సీఎం పర్యటనకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

- కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించిన ఎస్పీ




కడప క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లపై ఆదివారం పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎయిర్‌పోర్టు నుండి సీఎం కార్యక్రమం నిర్వహించే పబ్బాపురం వేదిక వరకు కాన్వాయి రిహార్సల్స్ నిర్వహించారు. ఎయిర్‌పోర్టు నుండి కాన్వాయి వచ్చే మార్గంలో చేపట్టవలసిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యశాఖ డీడీగా రాఘవరెడ్డి

కడప రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ డిప్యూటీ డైరక్టర్(డీడీ)గా రాఘవరెడ్డిని నియమించారు. ఈ మేరకు మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం నుండి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన నంద్యాల జిల్లాలో జేడీగా పనిచేస్తున్నారు. ఇక్కడ డీడీగా పనిచేస్తున్న రెడ్డయ్యను ఇటీవల ఎందుకో తప్పించారు. ఈ క్రమంలో రాఘవరెడ్డి నేడో రేపో బాధ్యతలు చేపట్టనున్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన గణేష్ ఫైల్‌ఫొటో

రాజంపేట టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మన్నూరు శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి కడప-చెన్నై జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని యర్రబల్లెకు చెందిన గణేష్(16) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా సాయిగౌడ్, హర్షవర్ధన్, వెంకటేశ్ (శ్రీను)లకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గణేష్ పదో తరగతి పూర్తి చేసుకుని పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో స్నేహితుడితో బోయనపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా మరో వాహనంపై ముగ్గురు వ్యక్తులు అతి వేగంతో మన్నూరు పద్మప్రియ కల్యాణమండపం సమీపంలో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు గాయపడిన వారిని 108 సహాయంతో రాజంపేట ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. సాయిగౌడ్, హర్షవర్ధన్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టంకు తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీ : ఇరువురికి గాయాలు

సిద్దవటం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి మాధవరం సమీపాన రాత్రి తిరుపతి వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇరువురికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న గంగాధర్, సుబ్రమణ్యంలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు ప్రైవేటు వాహనంలో తరలించారు. ఘటన స్థలానికి హైవే పెట్రోలింగ్ పోలీసులు చేరుకొని విచారిస్తున్నారు.

కడపలో మహానాడు జరగడం అదృష్టం

- ప్రతి టీడీపీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు


సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పుల్లారావు, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్

రాజంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ పండుగ కార్యక్రమం జరగడం ఈ ప్రాంతీయులు చేసుకున్న అదృష్టమని, మహానాడు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అందరూ తరలిరావాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు తెలిపారు. మహానాడు జనసమీకరణ కార్యక్రమంలో భాగంగా రాజంపేట తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో జరిగే మహానాడులో ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేసి భారీ ఎత్తున జనసమీకరణ చేయాలన్నారు. జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలో రాజంపేట నియోజకవర్గం నుంచి వేలాది మంది టీడీపీ కార్యకర్తలు మహానాడుకు రావాలన్నారు. వైసీపీ పాలనలో రాజంపేట నియోజకవర్గం అన్నివిధాలుగా నష్టపోయిందని, అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు ఎత్తకపోవడంతో తెగిపోయిందన్నారు. ప్రాజెక్టు తెగిపోయి 41 మంది చనిపోతే ఏ బాధితుడిని ఆదుకోలేదని, కనీసం పరామర్శించలేదన్నారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు అన్నమయ్య బాధితులను ఆదుకున్నారన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని, రైతులందరికీ తాగునీరు అందిస్తామన్నారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం నుంచి మహానాడుకు వెయ్యి వాహనాల్లో కార్యకర్తలను సమీకరిస్తామని వెల్లడించారు. మహానాడు విజయవంతానికి తమ వంతుగా అన్నివిధాలా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజంపేట పరిశీలకుడు దుర్గాప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు, పత్తిపాటి పుల్లారావులను జగన్‌మోహన్‌రాజు ఘనంగా సన్మానించారు.

చరిత్ర తిరగరాసేలా మహానాడు

- తెలుగు పండుగకు అందరూ రావాలి
- మంత్రి కొండపల్లె శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లె శ్రీనివాస్

బద్వేలుటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): తొలిసారిగా కడపలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు చరిత్ర తిరగరాసేలా ఉంటుందని ఎంఎస్ఎంఈ సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికార సంబంధాల శాఖ మంత్రి కొండపల్లె శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డితో మహానాడు జనసమీకరణతో పాటు మహానాడు ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై మహానాడు వేదికపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి దృఢసంకల్పంతో ఉన్నారన్నారు. మహానాడు పండుగకు తెలుగువారందరినీ ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి ఇక్కడకు పంపించారని, అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బద్వేలు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి మహానాడును దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు తుగ్గల నాగేంద్ర, కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, రైస్‌మిల్లు ప్రసాద్, బిగ్‌బాస్, మిత్తికాయల రమణ, జహంగీర్‌బాష, జీవి సుబ్బారెడ్డి, శివయ్యస్వామి, అన్నిమండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా చేయడమే లక్ష్యం


హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామేశ్వర్ గౌడ్

కడప ఎడ్యుకేషన్, మే 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా చేయాలన్నదే తన లక్ష్యమని విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ సంస్థ డైరెక్టర్ ఎ.రామేశ్వర్‌గౌడ్ అన్నారు. కడప కార్పొరేషన్ సమావేశ హాలులో ఆదివారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 50వేలకు పైగా, ఆంధ్రప్రదేశ్‌లో 10వేలకు పైగా ఉపాధ్యాయులకు ఇంత వరకు ఉచితంగా ఆంగ్లభాష నైపుణ్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు ఆంగ్లభాష నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారు విద్యార్థులకు నేర్పిస్తారని, అందుకే వారికి పూర్తి ఉచితంగా 40రోజుల ఆన్‌లైన్ శిక్షణ, ఏపీలోని వివిధ జిల్లా కేంద్రాలలో ఒక్కరోజు ఆఫ్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప ఇంగ్లీష్ ఫోరం నాయకులు సురేష్‌బాబు, వెంకటేష్ మాట్లాడుతూ రామేశ్వర్ గౌడ్ శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేదానికి ఉపకరిస్తాయన్నారు.

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి : తులసిరెడ్డి

వేంపల్లె, మే 25(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి కోరారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైసీపీ ఇచ్చిన జీవోను ఏడాది గడుస్తున్నా కూటమి ప్రభుత్వం రద్దు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇతర రాష్ట్రాల్లో తెలుగు మాధ్యమ పాఠశాలలు ఉన్నాయి కానీ ఆంధ్రప్రదేశ్‌లో లేకపోవడం దారుణమని, ఇంగ్లీష్ రాష్ట్రంగా మార్చాలని చూడడం క్షమించరాని నేరమన్నారు. వైద్య విద్యను ప్రైవేటుపరం చేయవద్దని, సాగునీటి రంగంలో బడ్జెట్‌లో 15శాతం కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

భార్య కాపురానికి రాలేదని యువకుడి ఆత్మహత్య

పీలేరు, మే 25(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పీలేరులో జరిగింది. పీలేరు ఎస్ఐ లోకేశ్ కథనం మేరకు.. పీలేరు పట్టణం లక్ష్మీపురం కాలనీకి చెందిన వినయ్ కుమార్(30)కు ఆరు నెలల క్రితం చంద్రగిరి మండలం రంగంపేటకు చెందిన శశికళతో వివాహమైంది. పెళ్లైన కొద్ది కాలానికే వారి మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడి పెద్దలు పంచాయితీ చేసేంత వరకు వెళ్లింది. దీంతో శశికళ తన పుట్టింటికి వెళ్లిపోగా ఆమెను తిరిగి తీసుకురావడానికి వినయ్ కుమార్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన వినయ్ కుమార్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వినయ్‌కుమార్ మృతదేహం

గంగమ్మ తల్లికి పూజలు



లక్కిరెడ్డిపల్లె, మే25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురంలో వెలిసిన గంగమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ సిబ్బంది భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు.

జీపీఎఫ్ స్కీం వర్తింపజేయాలని రిటైర్డ్ ఉద్యోగుల వినతి



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే25(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులందరికీ జీపీఎఫ్ స్కీమ్ వర్తింపజేయాలని విద్యుత్‌శాఖ రిటైర్డ్ ఉద్యోగులు ఆదివారం మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యుత్‌శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై వెంటనే స్పందించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అసౌకర్యాల మధ్య చిన్నారుల అవస్థలు

● అసంపూర్తిగా అంగన్వాడీ భవనాలు ● ఇరుకు గదులు, అద్దె గదులే దిక్కు ● చిన్నారులకు తప్పని అవస్థలు





గోడలకే పరిమితమైన జనార్దన్‌రెడ్డినగర్ అంగన్వాడీ కేంద్రం... పాడుబడిన గదిలో అంగన్వాడీ కేంద్రం

సుండుపల్లె, మే25(ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నామని, నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారుస్తామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా లేదు. ప్రధానంగా అంగన్వాడీ కేంద్రాలు అధ్వానంగా మారాయి. కొన్ని కేంద్రాల్లో తగిన సౌకర్యాలు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస వసతులు లేకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాశ్వత భవనాలకు, తాగునీరు, మరుగుదొడ్లు నిర్మించారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో సమస్యగా మారింది. ప్రభుత్వం నుంచి సకాలంలో అద్దెకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో అంగన్వాడీ కార్యకర్తలు సొంతంగా చెల్లించాల్సి వస్తుంది. కొన్నింటికి ఎలాంటి భవనం లేకపోవడంతో కమ్యూనిటీ హాళ్లు ఉపయోగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా నాడు-నేడు పథకానికి అంగన్వాడీ పాఠశాలలను ఎంపిక చేసింది. వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన భవనాలు ఎక్కడికక్కడ మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం సత్వరం అంగన్వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేసేలా నిధులు మంజూరు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

26 భవనాల నిర్మాణాలకే నిధులు రాక

సుండుపల్లె మండల వ్యాప్తంగా 26 అంగన్వాడీ భవనాల నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. నాడు- నేడు పథకం ద్వారా అన్ని ప్రభుత్వ బడులకు వసతులు కల్పిస్తామని చెప్పిన ఆర్భాటపు ప్రకటనలు కేవలం నోటి మాటలకే పరిమితమయ్యాయి. మండల వ్యాప్తంగా 115 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 79 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు, 36 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. చాలా అంగన్వాడీలు అద్దె భవనాల్లో లేదా సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. కేవలం 26 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అనుమతులు ఇచ్చి నిర్మాణాలను సైతం పూర్తి చేయలేకపోయారని విమర్శలు వస్తున్నాయి.

నిధులు రాగానే పనులు పూర్తి చేస్తాం

గత ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో నిధులు రాకపోవడం వలన పనులు పూర్తి కాలేదు. నిధులు వచ్చిన కాడికి పనులు పూర్తయ్యాయి. అంగన్వాడీ కేంద్రాల సమస్య చాలా చోట ఉంది. నాడు- నేడు ద్వారా నిర్మాణాలు ప్రారంభమైన వాటిని ప్రభుత్వం నుండి నిధులు రాగానే పూర్తి చేసి సేవలు అందించేలా చూస్తాము. - సుగుణమ్మ, ఏసీడీపీవో

ఐదేళ్లుగా గునాదులు.. గోడలే...

మండల వ్యాప్తంగా దాదాపు 20కిపైగా అంగన్వాడీ కేంద్రాలు కొన్ని గునాదులు, గోడల దశకే పరిమితమయ్యాయి. కొన్నిచోట్ల అంగన్వాడీ కేంద్రాల ఊసే కనిపించడం లేదు. కొంత మంది ఇళ్లలోనే అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తూ పాలు, కోడిగుడ్లు ఇతర ప్రభుత్వ సరఫరా చేసినా పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ఈ విధమైన పద్ధతి మారి అంగన్వాడీ కేంద్రాలకు మంచిరోజులు వచ్చి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

● పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి



చెంగల్‌రెడ్డిని సన్మానిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

రాయచోటి టౌన్, మే25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో మానవతా సంస్థ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్‌బాషా మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి తన వంతు సాయం ఉంటుందన్నారు. అనంతరం మానవతా సంస్థ చైర్మన్ శివగంగిరెడ్డి మాట్లాడుతూ మనం చేసే సేవే మనకు తృప్తినిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు యర్రపురెడ్డి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సంస్థలోని సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు సహకారం అందిస్తాన్నారు. అలాగే ఎస్వీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న వెంకటేశ్ కుమారుడు వెంకటశశికర్‌కు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రమణ, కోఛైర్మెన్ షకీల్, ఉపాధ్యక్షులు గంగాధర్‌నాయుడు, మాజీ సెక్రటరీ వెంకటరామరాజు, రామానాయుడు, సుదర్శన్‌రెడ్డి, నాగేశ్వరావు, నాగార్జున, పీరయ్య, శివరామకృష్ణ, ఈశ్వరయ్య, కొండారెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ విశేష కృషి



కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలకు భూమిపూజ చేస్తున్న నిశ్చల్‌నాగిరెడ్డి

చిన్నమండెం, మే25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు నిశ్చల్‌నాగిరెడ్డి అన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో కస్తూర్బా బాలికల గురుకుల జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా చిన్నమండెం మండలంలో రూ.1.60 కోట్లతో బాలికల గురుకుల జూనియర్ కళాశాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరి మెరుగైన విద్యను అభ్యసించాలన్నారు.

ఉత్సాహంగా విద్యార్థుల సమ్మేళనం





వీరబల్లి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు... ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వీరబల్లి, మే25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక వీరబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులు, దుగ్గనపల్లి విశ్వనాథరెడ్డి, జయరాంరాజు, మల్‌రెడ్డి రాంరెడ్డి, గంగాదేవిలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి సన్మానించారు. పూర్వ విద్యార్థులు దాదాపు 150 మంది వారి కుటుంబాలతో సహా హాజరయ్యారు. ఒకరినొకరు క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. ఒకరిని ఒకరు పేర్లు పెట్టి పిలుచుకున్నారు. అందరూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాల తర్వాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఒక్కో రంగంలో ఒక్కొక్కరు స్థిరపడి నేడు ఇలా ఇదే పాఠశాలలో కలుసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

ఒంటిమిట్ట, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1993-94 పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. చిరునవ్వులతో ఆలింగనం చేసుకుని ఆనందించారు. అమరులైన ఉపాధ్యాయులు, విద్యార్థులను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటలక్షుమ్మ, అప్పటి ఉపాధ్యాయులు బాలమ్మ, సాంబశివారెడ్డి, నారాయణరెడ్డి, గోపిక్రిష్ణ, విజయకుమార్, పసుపులేటి శంకర్, వైసీ సుబ్బరాయుడు, భారతి తదితరులు విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుబ్బారెడ్డి, నాగరాజు, గణేష్, పెంచలయ్య, సుబ్బరామిరెడ్డి, మురళిరెడ్డి, బాలత్రిపురసుందరి, గౌసియా, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఓబిలి గంగమ్మను దర్శించుకున్న శ్రీనివాసరాజు

పెనగలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ రాజంపేట ఇన్‌చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు ఆదివారం ఓబిలి దళితవాడలో గ్రామ దేవత గంగమ్మను దర్శించుకున్నారు. గ్రామ ప్ర జల ఆహ్వానం మేరకు ఆయన తన అనుచరులతో కలిసి ఓబిలి గ్రా మాన్ని సందర్శించారు. అనంతరం జనసేన పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమై గ్రామ సమస్యలపై వాకబు చేశారు. ఈ సమావేశంలో ఓబిలి జనసేన యూత్ ఎస్వీ ప్రసాద్, రమేష్‌బాబు, నరసింహులు, హరిప్రసాద్, సుబ్బరాయుడు, వేములయ్య, పెంచలయ్య, హరిక్రిష్ణ, సునీల్, రాజా, శశిధర్, హరినాథ్ ప్రతీష్, రవి, గణేష్, రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు.

క్రియాశీలక సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా



జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్‌లను పంపిణీ చేస్తున్న కృష్ణ

సిద్దవటం, మే 25 (ఆంధ్రజ్యోతి):కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజంపేట జనసేనపార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరం-1లో పార్వతీపురం ఎస్‌కేఆర్‌నగర్, హరిజనవాడ, ఉప్పరపల్లె గ్రామాల్లో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ హాజరయ్యారు. ముందుగా జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, అతికారి క్రిష్ణను ఘనంగా సన్మానించి చేనేత చీరను అందించారు.

కార్యకర్తల అభిమానం మరువలేనిది

సంబేపల్లె, మే25(ఆంధ్రజ్యోతి): తమ కుటుంబంపై కార్యకర్తలకు ఉన్న అభిమానం మరువలేనిదని టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. ఆదివారం సంబేపల్లె మండలం నారాయణరెడ్డి గ్రామం మంచాలమ్మ దేవతకు కార్యకర్తలు బోనాలు సమర్పించిన సందర్భంగా విందు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యకర్తలు శానంపల్లి ఆంజనేయులునాయుడు, శ్రీనివాసులునాయుడు, శంకర ఆహ్వానం మేరకు విందు కార్యక్రమానికి హాజరయ్యారు.

భోజన వసతి ఏర్పాట్ల పరిశీలన

రామాపురం, మే25(ఆంధ్రజ్యోతి): కడప పట్టణంలోని పబ్బాపురం సమీపంలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమానికి సంధించి రామాపురం మీదుగా వెళ్లే వారికి గువ్వలచెరువు సమీపంలో భోజన వసతి ఏర్పాట్లను ఆదివారం టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు లక్ష మందికి భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

గాలివీడు, మే25(ఆంధ్రజ్యోతి): కడప పట్టణంలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరగనున్న మహానాడును విజయంతం చేయాలని మండల పరిశీలకుడు మోహన్‌రావు పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని శ్రీకాంత్‌రెడ్డి స్వగృహంలో టీడీపీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 17 పంచాతీయల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్‌రియాజ్, ద్రప్పనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాలకొండ్రాయుడి సంస్మరణ సభ



మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం, మే25(ఆంధ్రజ్యోతి): రాయచోటి టీడీపీ కురువృద్ధుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ దివంగత నేత సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను చిన్నమండెం మండల దిగువగొట్టివీడు పంచాయతీలోని దళి తవాడలో ఆదివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన తనయుడు సుగవాసి ప్రసాద్‌బాబు విచ్చేశారు. బడుగు, బలహీన వర్గాల ఎదుగుదలకు పాలకొండ్రాయుడు ఎంతో కృషి చేశాడని గ్రా మస్థులు పేర్కొన్నారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ తన తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మకు పొంగళ్లు

పుల్లంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని కొత్తపల్లి అగ్రహారంలో ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో గ్రామదేవత ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆసాదుల ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లిని బొమ్మను గీసి అమ్మవారి కథను వినిపించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయంలో అన్న సంతర్పణ చేశారు.

అవినీతిపై విచారణ జరపండి : సీఐటీయూ

ఓబులవారిపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ డిప్యూటీ మేనేజర్ హెచ్ఆర్‌డీ కళావతి అవినీతిపైన విచారణ జరపాలని ఏపీఎండీసీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఓబులవారిపల్లె సీఐటీయూ మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య డిమాండ్ చేశారు. వాహనం వాడుకొని ఏపీఎండీసీ సంస్థ డబ్బు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. మేనెల 30న పదవీ విరమణ కానున్న ఆమె వచ్చే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ నిలుపుదల చేసి శిక్షించాలన్నారు.

ముగిసిన మారెమ్మ తల్లి తిరునాళ్లు



పూజలందుకుంటున్న మారెమ్మ తల్లి, కాళికాదేవి

సుండుపల్లె, మే25(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని మాచిరెడ్డిగారి పల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికి సమీపంలో కుడికాలువ గట్టుపై వెలిసిన మారెమ్మ తల్లి, కాళికాదేవిల తిరుణాల ఆదివారం ఘనంగా ముసిగింది. గత మూడు రోజుల నుండి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. అలాగే సేవాలాల్ మహరాజ్‌కు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగుబాలు పెట్టారు.

ప్రజారంజక పాలనను అందించాలి: సీపీఐ

రైల్వేకోడూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రజారంజక పాలనను అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ఆదివారం సీపీఐ రైల్వేకోడూరు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవిలో ఉన్న సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ చనిపోయిన వారి ముందు ఆనందంతో కేరింతలు కొట్టడం దారుణమన్నారు. మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

సంబేపల్లె, మే25(ఆంధ్రజ్యోతి): పంటసాగుకు రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తెలిపారు. ఆదివారం సంబేపల్లె మండల కేంద్రంలో రైతు సంఘం మండల కార్యకర్తల సమవేశం ఏరియా అధ్యక్షుడు వడ్లమూరి హరినాథనాయుడు అధ్యక్షతన జరిగింది. అనంతరం సంబేపల్లె మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా అర్జున్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా రాజశేఖర్‌నాయుడు, కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రయ్యనాయుడు, రాజేంద్రనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా భాస్కర్‌రెడ్డి, పూ జారి కృష్ణ, బ్రహ్మానందరెడ్డి, కోశాధికారి వర్ల మధన్‌మోహన్‌లను ఎంపిక చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన డీసీఎంఎస్ ఛైర్మన్



ముఖ్యమంత్రికి నమస్కారం చేస్తున్న జయప్రకాష్

రైల్వేకోడూరు రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కుప్పంలో ఆదివారం డీసీఎంఎస్ ఛైర్మన్, టీడీపీ రైల్వేకోడూరు నాయకుడు ఎర్రగుండ్ల జయప్రకాశ్ కలిశారు. సీఎం కుప్పంలో ఏర్పాటు చేసిన గృహ ప్రవేశానికి జయప్రకాశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను డీసీఎంఎస్ ఛైర్మన్ నియమించిన సందర్భంగా ముఖ్యమంత్రి, ఆయన సతీమణిని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు వివరించారు.

సుండుపల్లె సమస్యలపై మంత్రికి వినతి



రామానాయుడికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

సుండుపల్లె, మే25(ఆంధ్రజ్యోతి): సుండుపల్లెలో నెలకొన్న ప్రధాన సమస్యలపై నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప తెలిపారు. రాజంపేటకు వచ్చిన నీటిపారుదలశాఖ మంత్రిని కలిసి ఝరికోన నుంచి సాగునీటి కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. అలాగే గత ప్రభుత్వంలో ఆగిపోయిన రాయచోటి-సుండుపల్లె డబుల్ రోడ్డు పనులను, రోళ్లమడుగు నీటి పథకాన్ని పూర్తి చేయాలని విన్నవించామన్నారు. మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శవరాంనాయుడు, మాజీ ఎంపీటీసీ బెల్లాల రమణ పాల్గొన్నారు.

జీఎస్ మూర్తిని సత్కరించిన ఎద్దుల సాగర్



నందలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానం స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికైన సీనియర్ న్యాయవాది జీఎస్ మూర్తిని రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్ ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తూ న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న నాయకులకు తాను అండగా ఉండేవాడన్నారు. టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దొనకొండమ్మ దీవెనలతో ప్రజలందరికీ మంచి జరగాలి

రాయచోటిటౌన్, మే25(ఆంధ్రజ్యోతి):దొనకొండమ్మ చల్లని దీవెనలతో ప్రజలందరికీ మంచి జరగాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆయన దొనకొండమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం రెడ్డివారిపల్లెలో టీడీపీ నాయకుడు గంగిరెడ్డి ఆహ్వానం మేరకు విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు గుర్రం సుబ్బయ్యనాయుడు, టీడీపీ నాయకులు చిన్నారి వెంకట్రమణ, ఆదిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, డీలర్ గంగయ్య గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు, పెనగలూరులో వర్షం



మే నెలలో చల్లటి వాతావరణం ఏర్పడటం వల్ల చాలా హాయిగా ఉందని ప్రజలు అనుకుంటున్నారు.

రైల్వేకోడూరు, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక మోస్తారు వర్షం కురిసింది. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. ఇటీవల తరచూ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఎండ తీవ్రత తో ప్రజలు తల్లడిల్లిపోయారు. చల్లబడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

పెనగలూరు: ఉపరిత ఆవర్తనం కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. సాయంత్రం మూడు గంటల నుంచి మబ్బులతో వాతావరణం చల్లబడిపోగా సాయంత్రం నుంచి పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

రాజంపేటలో ఉచిత వైద్యశిబిరం

రాజంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో సీఎన్ఆర్ పాలీక్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జనసేన నాయకులు శ్రీనివాసరాజు ప్రారంభించారు. డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలను నిర్వహించారు. ఎముకలు, ప్లాస్టిక్ సర్జరి, చిన్నపిల్లలకు వైద్యసేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీన్ఆర్ పాలీక్లీనిక్ మేనేజర్ హరికృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం... వినోదం...

- చిన్నారుల్లో సృజనకు బీజం...వేసవి శిక్షణ శిబిరం
- కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు పేరుతో పీలేరు గ్రంథాలయంలో చిన్నారులకు శిక్షణ

పీలేరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా పుస్తకాలు, హోం వర్కులు, అసైన్‌మెంట్లతో సిగపట్లు పడుతూ, కేజీల కొద్దీ స్కూల్ బ్యాగులు మోస్తూ అలసిపోయిన చిన్నారి హృదయాలకు వేసవి సెలవులు పెద్ద ఉపశమనం. అందుకే వేసవి సెలవులు ఎప్పుడెప్పుడు వస్తాయా అంటూ చిన్నారులు ఎదురుచూస్తూ ఉంటారు. ఆ సెలవుల్లో అమ్మమ్మ, నానమ్మ ఊళ్లకు వెళ్లి నెల రోజులపాటు హాయిగా గడపవచ్చునని వారి ఆశ. అయితే సెల్ ఫోన్లు, టీవీల కారణంగా చిన్నారుల దైనందిన అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగా అవే వేసవి సెలవులు వారికి పెద్ద శాపంలా మారవచ్చునంటున్నారు మానసిక శాస్త్ర నిపుణులు. అప్పటి వరకు పుస్తకాల నడుమ గడిపిన వారు సెలవుల్లో దొరికిన విరామాన్ని సెల్‌ఫోన్లు, టీవీలకు అలవాటుపడితే పెద్దప్రమాదమే పొంచి ఉందని వారు హెచ్చరిస్తున్నారు. పిల్లలు వాటికి అలవాటుపడకుండా వారిని డ్రాయింగ్, డ్యాన్స్, చెస్, కథలు రాయడం, కథలు వినడం వంటి అనేక సృజనాత్మక కళలు, క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని వారు సూచిస్తున్నారు. పెద్దపెద్ద పట్టణాల్లో అయితే అనేక సంస్థలు వేసవి సెలవుల్లో ప్రత్యేకంగా పిల్లల కోసం అనేక రంగాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంటాయి. చిన్న చిన్న గ్రామాల నుంచి ఓ మోస్తరు పట్టణాల్లో అటువంటి సౌకర్యం ఉండదు. కానీ జిల్లా గ్రంథాలయ సంస్థ 'వేసవి విజ్ఞాన తరగతులు' పేరుతో చిన్నారుల కోసం ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తోంది. గ్రంథాలయం ఉన్న ప్రతి ఊరిలోనూ ఈ శిబిరాలను ఏర్పాటు చేసింది. ఆ క్రమంలో పీలేరులోని పద్మావతి నగర్‌లో ఉన్న శాఖా గ్రంథాలయంలోనూ చిన్నారులకు క్యారమ్స్, చెస్, శాస్త్రీయ సంగీతం, డ్రాయింగ్, పుస్తక పఠనం, కథలు చెప్పడం, కథలు రాయడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వేసవి సెలవులలో విద్యార్థులు, చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఉపయోగపడతాయని పలువురు ఉపాధ్యాయులు సైతం బలపరుస్తున్నారు. పీలేరులోని గ్రంథాలయంలో ప్రస్తుతం 25 మంది చిన్నారులు ప్రతిరోజూ అనేక అంశాల్లో శిక్షణ పొందుతున్నారు.

జూన్ 6 వరకు విజ్ఞాన తరగతులు

వేసవి సెలవులు ఈ ఏడాది ఏప్రిల్ మాసం చివరి నాటి నుంచి మొదలయ్యాయి. అయితే గ్రంథాలయ సంస్థ ఆ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు తమ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా పీలేరు గ్రంథాలయంలో ప్రస్తుతం చిన్నారులకు డ్రాయింగ్, చెస్, క్యారెమ్స్, సంగీతం, శాస్త్రీయ నృత్యం, కబడ్డీ, కథలు రాయడం, కథలు చెప్పడం వంటి అనేక అంశాల్లో ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు స్థానిక గ్రంథాలయాధికారి అమరనాథ్. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటలు వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కొంతమంది చిన్నారులు సాయంత్రం పూట కూడా వస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో కూడా పట్టు సాధించాలన్న తపనతో పలువురు ప్రభుత్వ ఇంగ్లిష్ ఉపాధ్యాయులను సంప్రదించి పాఠాలు చెప్పిస్తున్నారు. ఎటువంటి రుసుము లేకుండా కేవలం విద్యార్థుల సంపూర్ణ వికాస అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వేసవి విజ్ఞాన తరగతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. పెద్దపెద్ద పట్టణాల్లో పెద్ద మొత్తాల్లో ఫీజులు వసూలు చేసి నేర్పే అనేక అంశాలను మేము ఆయా రంగాల్లో నిష్ణాతుల ద్వారా ఉచితంగా బోధిస్తున్నాం. ఏడాది పొడవునా పుస్తకాలతో పోటీ పడే చిన్నారులు వేసవి సెలవుల్లో తమలో దాగి ఉన్న సృజనాత్మకతను తెలుసుకునేందుకు వేసవి శిబిరం ఉపయోగపడుతుంది. తద్వారా విద్యార్థి జీవితంలో ఉండే ఒత్తిడి చాలా వరకు తగ్గుతుంది.

- అమరనాథ్, గ్రంథాలయాధికారి, పీలేరు



పుస్తక పఠనంలో చిన్నారులు



గ్రంథాలయంలో యోగా నేర్చుకుంటున్న చిన్నారులు



చెస్, క్యారెమ్స్ నేర్చుకుంటున్న చిన్నారులు

పేర్ని నానీ.. తైతక్కలాడే పద్ధతి మానుకో..

- లిక్కర్ స్కామ్‌లో జగన్ అరెస్టయితే నీ గతేంటో..
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కడప మారుతీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీని ప్రజలు ఛీత్కరించుకున్నప్పటికీ పిచ్చిపిచ్చి ప్రేలాపనలాడుతున్న పేర్ని నాని తైతక్కలాడే పద్ధతి మానుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హితవు పలికారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడు ముసుగులో కడపలో దగానాడు సభలను నిర్వహిస్తున్నారని పేర్ని నాని నోరు పారేసుకోవడం సరైంది కాదన్నారు. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లన్నీ గుంతలమయం చేశారన్నారు. ఎక్కడైనా ఒక్కటంటే ఒక్క తట్ట మట్టి కూడా పోయలేని దుస్థితిలో పాలన సాగించారన్నారు. క్రమశిక్షణకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని, కనుకనే ఆత్మాభిమానం చంపుకోలేక వైసీపీని వీడానన్నారు. మహిళలంటే చంద్రబాబుకు ఎనలేని గౌరవమని, కనుకనే బియ్యం అక్రమ రవాణాలో నీ భార్య అడ్డంగా దొరికినా సాక్ష్యాధారాలు దొరికే వరకూ ఇబ్బంది పెట్టకూడదన్న మంచి మనసున్న నాయకుడు చంద్రబాబు అన్నారు. లిక్కర్ స్కామ్‌లో జగన్ జైలుకెళ్లబోతున్నారని, అప్పుడు నీ గతేంటో చూస్తామన్నారు. సమావేశంలో టీడీపీ మీడియా జనరల్‌సెక్రటరీ జనార్ధన్ పాల్గొన్నారు.

మహానాడు విజయవంతం అవుతుంది

- పులివెందుల నియోజకవర్గం నుంచి 20వేల మంది
- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, బీటెక్ రవి



వేంపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న మహానాడు విజయవంతం అవుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మహానాడు ఏర్పాట్లలో భాగంగా పులివెందులకు వచ్చిన ఆయన వేంపల్లె ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో రాయలసీమ జిల్లాల్లో టీడీపీపై ప్రజలు ఎనలేని అభిమానం చూపించారని, అందుకు కృతజ్ఞతగానే కడపలో మహానాడును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదావరి-బనకచెర్ల ప్రాజెక్టుతో రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం నుంచి ప్రస్తుతానికి 15వేల మంది నుంచి 20వేల వరకు మహానాడుకు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మహానాడు : మంత్రి సుభాష్



సీకేదిన్నె, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడును స్వచ్ఛ మహానాడుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మహానాడును విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ తుది దశకు చేరుకున్నాయన్నారు. స్వచ్ఛ మహానాడుగా నిర్వహించడంలో వలంటీర్లు, ఐటీడీపీ చాంపియన్లు కీలకపాత్ర వహించాలన్నారు. వచ్చిన ప్రతినిధులకు అవసరమైన టాయిలెట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, ఎక్కడ ఎటువంటి చిన్న వాటర్ బాటిల్ కూడా కనిపించకుండా పరిశుభ్రంగా ఉంచాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రతినిధుల సమావేశ ప్రాంగణం ముందు 50 టాయిలెట్స్, మీడియా సెంటర్‌లో 10, వీవీఐపికి 10, కమాండ్ కంట్రోల్, సీఎం బస వద్ద, వంటశాల వద్ద ఏడు, పార్కింగ్ ఏరియాల్లో 150 టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత పట్టాభి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ : ఇరువురికి గాయాలు



సిద్దవటం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి మాధవరం సమీపాన రాత్రి తిరుపతి వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇరువురికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న గంగాధర్, సుబ్రమణ్యంలకు స్వల్ప గాయాలయ్యాయి. మెరుగైన వైద్యసేవల కోసం కడప రిమ్స్‌కు స్థానికులు ప్రైవేటు వాహనంలో తరలించారు. ఘటన స్థలానికి హైవే పెట్రోలింగ్ పోలీసులు చేరుకొని విచారిస్తున్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించిన ఎస్పీ



కడప క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లపై ఆదివారం పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎయిర్‌పోర్టు నుండి సీఎం కార్యక్రమం నిర్వహించే పబ్బాపురం వేదిక వరకు కాన్వాయి రిహార్సల్స్ నిర్వహించారు. ఎయిర్‌పోర్టు నుండి కాన్వాయి వచ్చే మార్గంలో చేపట్టవలసిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన గణేష్ ఫైల్‌ఫొటో

రాజంపేట టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మన్నూరు శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి కడప-చెన్నై జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని యర్రబల్లెకు చెందిన గణేష్(16) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా సాయిగౌడ్, హర్షవర్దన్, వెంకటేశ్ (శ్రీను)లకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గణేష్ పదో తరగతి పూర్తి చేసుకుని పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో స్నేహితుడితో బోయనపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా మరో వాహనంపై ముగ్గురు వ్యక్తులు అతి వేగంతో మన్నూరు పద్మప్రియ కల్యాణమండపం సమీపంలో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు గాయపడిన వారిని 108 సహాయంతో రాజంపేట ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. సాయిగౌడ్, హర్షవర్దన్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టంకు తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

కలకడ, మే 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ యువతి అదృశ్యమైన సంఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 24వ తేదీన ప్రైవేట్ ఉద్యోగం ఇంటర్వ్యూకి అని తిరుపతికి వెళ్లి ఇంటికి రాలేదని చెప్పారు. ఆచూకీ కోసం బంధువులు, చుట్టు పక్కల వెతికినా తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు యువకులకు గాయాలు

- ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ప్రమాదం

మదనపల్లె అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన ముగ్గురు యువకులు హార్సిలీహిల్స్‌కు బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణంలో ఘాట్‌లో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కిందపడి గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం విజయనగర్ కాలనీకి చెందిన గోపీ కుమారులు నిఖిల్,(19) నితిన్(21), మదనపల్లె పట్టణం చీకలగుట్టకు చెందిన సురేష్ కుమారుడు భరత్(19) ముగ్గురు కలిసి ఆదివారం ఉదయం బైక్‌పై హార్సిలీహిల్స్ వెళ్లి అక్కడ సందర్శించుకుని మదనపల్లెకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో హార్సిలీహిల్స్ ఘాట్ దిగుతుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి రోడ్డులో కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ముగ్గిరికీ గాయాలు కాగా గమనించిన స్థానికులు మదన పల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించా రు. మెరుగైన వైద్యం కోసం నిఖిల్, నితిన్‌ను తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు బి.కొత్తకోట పోలీసులు కేసు విషయమై దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



కడపలో మహానాడు జరగడం అదృష్టం

- ప్రతి టీడీపీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పుల్లారావు, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్

రాజంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ పండుగ కార్యక్రమం జరగడం ఈ ప్రాంతీయులు చేసుకున్న అదృష్టమని, మహానాడు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అందరూ తరలిరావాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు తెలిపారు. మహానాడు జనసమీకరణ కార్యక్రమంలో భాగంగా రాజంపేట తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో జరిగే మహానాడులో ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేసి భారీ ఎత్తున జనసమీకరణ చేయాలన్నారు. జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలో రాజంపేట నియోజకవర్గం నుంచి వేలాది మంది టీడీపీ కార్యకర్తలు మహానాడుకు రావాలన్నారు. వైసీపీ పాలనలో రాజంపేట నియోజకవర్గం అన్నివిధాలుగా నష్టపోయిందని, అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు ఎత్తకపోవడంతో తెగిపోయిందన్నారు. ప్రాజెక్టు తెగిపోయి 41 మంది చనిపోతే ఏ బాధితుడిని ఆదుకోలేదని, కనీసం పరామర్శించలేదన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబునాయుడు వెంటనే అన్నమయ్య బాధితులను ఆదుకున్నారన్నారు. రాజంపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని, రైతులందరికీ తాగునీరు అందిస్తామన్నారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం నుంచి మహానాడుకు వెయ్యి వాహనాల్లో కార్యకర్తలను సమీకరిస్తామని వెల్లడించారు. మహానాడు విజయవంతానికి తమ వంతుగా అన్నివిధాలా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజంపేట పరిశీలకుడు దుర్గాప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు, పత్తిపాటి పుల్లారావులను జగన్‌మోహన్‌రాజు ఘనంగా సన్మానించారు.

చరిత్ర తిరగరాసేలా మహానాడు

- తెలుగు పండుగకు అందరూ రావాలి
- మంత్రి కొండపల్లె శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లె శ్రీనివాస్

బద్వేలుటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): తొలిసారిగా కడపలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు చరిత్ర తిరగరాసేలా ఉంటుందని ఎంఎస్ఎంఈ సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికార సంబంధాల శాఖ మంత్రి కొండపల్లె శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాల యంలో ఆయన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్ రెడ్డితో మహా నాడు జనసమీకరణతో పాటు మహానాడు ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై మహానాడు వేదికపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి దృఢసంకల్పంతో ఉన్నారన్నారు. మహానాడు పండుగకు తెలుగువారందరినీ ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి ఇక్కడకు పంపించారని, అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బద్వేలు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మహానాడును దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు తుగ్గల నాగేంద్ర, కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, రైస్‌మిల్లు ప్రసాద్, మిత్తికాయల రమణ, జీవి సుబ్బారెడ్డి, శివయ్యస్వామి, అన్నిమండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

- మరో వ్యక్తికి గాయాలు



మురళి మృతదేహం

కలకడ, మే 25(ఆంధ్రజ్యోతి): కరెంట్ షాక్‌కు గురై మురళి(21) అనే యువకుడు మృతి చెందగా మరో వ్యక్తి నారాయణ(35)కి గాయాలైన సంఘటన కలకడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయుల కథనం మేరకు.. నలుగురు సహ కూలీలైన మురళి, నారాయణ, నాగయ్య, బాబు సంబేపల్లె మండలం సోమవరం గ్రామ సమీపంలో బొగ్గు కాల్చే పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు శనివారం రాత్రి 11 గంటల సమయంలో కుందేలును వేటాడటానికి రాతిగుంటపల్లె పంచాయతీ ఎగువబట్టవారిపల్లె చెరువు సమీపంలోని బీడు పొలాలలో రెండు బృందాలుగా విడిపోయినట్లు తెలిపారు. ఓ బృందంలోని నారాయణ, మురళి కరెంట్ షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనలో మురళి కరెంట్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందగా నారాయణకు రక్తగాయాలయ్యాయి. గాయపడిన నారాయణను తిరుపతి రూయాసుప్రతికి తరలించారు. కాగా మృతుడు మురళి స్వస్థలం కడప జిల్లా బ్రహ్మంగారిమఠం ఓడ్డునబావి గ్రామానికి చెందినవాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే మురళి మృతి చెందడానికి వేటగాళ్లు తీసిన కరెంట్ కారణమా అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి : తులసిరెడ్డి

వేంపల్లె, మే 25(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి కోరారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైసీపీ ఇచ్చిన జీవోను ఏడాది గడుస్తున్నా కూటమి ప్రభుత్వం రద్దు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇతర రాష్ట్రాల్లో తెలుగు మాధ్యమ పాఠశాలలు ఉన్నాయి కానీ ఆంధ్రప్రదేశ్‌లో లేకపోవడం దారుణమని, ఇంగ్లిష్ రాష్ట్రంగా మార్చాలని చూడడం క్షమించరాని నేరమన్నారు. వైద్య విద్యను ప్రైవేటుపరం చేయవద్దని, సాగునీటి రంగంలో బడ్జెట్‌లో 15శాతం కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

భార్య కాపురానికి రాలేదని యువకుడి ఆత్మహత్య

పీలేరు, మే 25(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పీలేరులో జరిగింది. పీలేరు ఎస్‌ఐ లోకేశ్ కథనం మేరకు.. పీలేరు పట్టణం లక్ష్మీపురం కాలనీకి చెందిన వినయ్ కుమార్(30)కు ఆరు నెలల క్రితం చంద్రగిరి మండలం రంగంపేటకు చెందిన శశికళతో వివాహమైంది. పెళ్లైన కొద్ది కాలానికే వారి మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడి పెద్దలు పంచాయితీ చేసేంత వరకు వెళ్లింది. దీంతో శశికళ తన పుట్టింటికి వెళ్లిపోగా ఆమెను తిరిగి తీసుకురావడానికి వినయ్ కుమార్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన వినయ్ కుమార్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వినయ్‌కుమార్ మృతదేహం

అవసరం కొండంత..
మంజూరు గోరంత!



పెద్దమండ్యం మండలంలో దుక్కులు చేస్తున్న రైతులు

- 57 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- 36వేల క్వింటాళ్లు కేటాయింపు
- విస్తారంగా వర్షాలు
- సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు

మదనపల్లె టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): వరుస కరువు కారణంగా రెండేళ్లుగా తీవ్రంగా నష్టపోయిన వేరుశనగ రైతుల్లో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆశలు రేకెత్తిస్తున్నాయి. ముందస్తుగా రాయలసీమను తాకుతుండ డంతో ఈ ఖరీఫ్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతా వరణ శాఖ వెల్లడిస్తోంది. దీంతో ఈ సారి వేరుశనగ సాగుపై రైతులు ఆశలు పెంచుకున్నారు. అయితే, సబ్సిడీ విత్తనాల మంజూరు అంతంత మాత్రంగానే ఉండడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగు విస్తీర్ణం రెట్టింపు?

జిల్లాలో 2023, 2024 ఖరీఫ్ సీజన్లలో 36 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ సాగు చేశారు. అప్పట్లో అధికారులు 55వేల క్వింటాళ్లు ఒకసారి, 48వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ రెండేళ్లు సకాలంలో వర్షాలు కురవక సాగు చేయలేకపోయారు. దీంతో ఈ సారి జిల్లాలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణాన్ని అధికారులు 16 వేల హెక్టార్లుగా గుర్తించారు. దీనికి అనుగుణంగా 60శాతం 38 వేల క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. ఈ సారి జిల్లాలో సకాలంలో వర్షాలు కురిసే అవకాశం మెండుగా ఉండటంతో సబ్సిడీ విత్తనాలకు బాగా డిమాండ్ పెరగనుంది.



సబ్సిడీ వేరుశనగ విత్తనాల బస్తాలు

40శాతం సబ్సిడీకి అవకాశం

2025 ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనాలను 40శాతం సబ్సిడీపై పంపిణీ చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది ఇందులో కే-6 రకం, నారాయణి, వశిష్ట (టీసీడీఎస్)రకాలు మాత్రమే గ్రౌండ్ చేస్తున్నారు. కిలోకు సబ్సిడీ పోను రూ.55.80 రైతులు చెల్లించాల్సి వుంది. అంటే 30 కిలోల బస్తా రూ.1675గా ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో రైతుకు సాగుచేసే విస్తీర్ణం బట్టి రెండు బస్తాలను మాత్రమే పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఈ సారి సబ్సిడీ విత్తనాలకు డిమాండ్ పెరగనుంది.

రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్

వేరుశనగ విత్తనాలు అవసరమైన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ నెలాఖరు లోగా రైతులు వారి భూమి వివరాలతో పట్టాదారు పాసుపుస్తకాలు చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.దీని ఆధారంగా కే-6 రకం 20,476 క్వింటాళ్లు, నారాయణి రకం14,559 క్వింటాళ్లు, టీసీజీఎస్ 999 క్వింటాళ్లు మొత్తం కలిపి 36,034 క్వింటాళ్ల సబ్సిడి విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాలకు తరలించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

ఉత్తర్వులు వచ్చిన వెంటనే పంపిణీ

వేరుశనగ విత్తనాల సబ్సిడీపై ప్రభుత్వం తుది నిర్ణయం ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవాకేంద్రాలకువేరుశనగ విత్తనకాయలను కేటాయించాం. ఏపీ సీడ్స్ నుంచి వచ్చిన విత్తనాలను ఆయా ఆర్ఎస్‌కేలకు సరఫరా చేస్తున్నాం. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే జిల్లాలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తాం.

- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, రాయచోటి

'విద్యార్థి ఉద్యమాల్లో ఎస్ఎఫ్ఐ వేగుచుక్క లాంటిది'



పూలే దంపతుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మదనపల్లె టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థి ఉద్యమాల్లో ఎస్ఎఫ్ఐ వేగుచుక్క లాంటిదని అఖిల భారత ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు వీపీ సాను తెలిపారు. ఆదివారం స్థానిక ప్రైవేటు కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిపోతున్నా నేటికీ పేదలకు విద్య అందని ద్రాక్షలాగానే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. విద్యా వ్యవస్థను కార్పొరేట్ పరం చేయడంలోనే కేంద్ర ప్రభుత్వం ఏకాగ్రత పెడుతోందని విమర్శించారు. ఎయిడెడ్ విద్యా సంస్థలను ప్రైవేటుపరం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని, ఈ ప్రయత్నాన్ని ఎస్ఎఫ్ఐ దీటుగా అడ్డు కుంటోందన్నారు. అంతకు ముందు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, రమణ, నాయకులు పరమేశ్, రామ్మోహన్, అబ్దుల్లా, నవిత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

'రాజంపేట'తెలుగు యువత కార్యదర్శిగా మధుసూదన్



నియామక పత్రాలు అందుకుంటున్న తెలుగు యువత నాయకులు

తంబళ్లపల్లె, మే 25(ఆంధ్రజ్యోతి): తెలుగు యువత రాజంపేట పార్లమెంట్ కార్యదర్శిగా తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లెకు చెందిన బి.మధుసూదన్ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా తంబళ్లపల్లెకు చెందిన శివకుమార్ నియమితులయ్యారు. ములకలచెరువు టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి నియామక పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో యువత, నాయకులు, కార్యకర్తలను కలుపుకుని కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, ఇన్‌చార్జి జయచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక



మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. గౌరవాధ్యక్షుడుగా తోపు కృష్ణప్ప, గౌరవ సలహాదారులుగా మురళి, సాంబ శివ, అ ధ్యక్షుడుగా ఎస్ మస్తాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసు, ఉపాధ్యక్షుడుగా మిఠాయి శ్రీనివాసులు, ఇంద్రాణి, సాంబశివనాయక్, పి. నరసింహులు, కార్యదర్శిగా చలపతి నాయుడు,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దేవా, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాసులురెడ్డి, నర్సింహులు, సహాయ కార్యదర్శులుగా జానకి , రాధ, కె. కృష్ణప్ప, కోశాధికారి చంద్ర, శంకర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్, చలపతినాయుడు మాట్లాడుతూ మా ఎన్నికకు సహకరించిన ఏఐటీయూసీ నాయకులకు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

'పదిలో టాపర్లకు ప్రోత్సాహకాలు'



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్ర.

పీలేరు రూరల్, మే 25 (ఆంధ్ర జ్యోతి): పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని మానవతా సంస్థ ఛైర్మన్ డాక్టర్ వీ. రామచంద్ర తెలిపారు. ఆదివారం పీలేరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మానవత సంస్థ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు పీలేరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి మొదటి, ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులలో బెంచీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నూతన కమిటీ ఏర్పాటుతోపాటు, సభ్యత్వ నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకట్రమణారెడ్డి, పెంజూరి అశోక్, హరికుమార్, కృష్ణమూర్తి, నాగరాజు, వై.వీ. రమణ, అక్రమ్ బాషా, జీ.వీ. రమణ, తహత్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీలేరులో ఉరుసు



హజరత్ మహబూబ్ సుబహాని మినారు

పీలేరు, మే 25(ఆంధ్రజ్యోతి): పీలేరులోని హజరత్ మహబూబ్ సుబహాని మినారు వద్ద మూడు రోజులపాటు ఉరుసు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా స్థానిక పెద్దపీర్ల చావిడి వద్ద సోమవారం గంధం, మంగళ, బుధవారాల్లో ఖవ్వాలీ ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి పూల తాజియా, విద్యుత్ దీపాల అలంకరణ, ఫకీర్ల ప్రదర్శనల మధ్య తిరుపతికి చెందిన మత గురువు హజరత్ షఫీ అహ్మద్ ఖాదరి ఆధ్వర్యంలో గంధం ఊరేగింపు ఉంటుందని ఉరుసు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళ, బుధవారాల్లో జాతీయస్థాయిలో ప్రఖ్యాతి గాంచిన ఖవ్వాలీ గాయకులతో పాటకచేరీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉరుసులో దుకాణాల ఏర్పాటుకు ఇప్పటికే జిల్లాతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పీలేరుకు చేరుకున్నారు. ఉరుసుకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉరుసు కమిటీ సభ్యులు బడా మకాన్ ప్రాంతంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

ఆలోచించి అడుగేయండి: ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె, మే 25(ఆంధ్రజ్యోతి): పార్టీ మారే విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తమ పార్టీ కౌన్సిలర్లకు సూచించారు. మదనపల్లె వైసీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, స్థానిక వైసీపీ ఇన్‌చార్జి ఎస్.నిస్సార్‌అహ్మద్, ఏపీ ఎండీసీ మాజీ ఛైర్‌పర్సన్ జి.షమీంఅస్లాంతో కలసి మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజతోపాటు 25 మంది వైసీపీ కౌన్సిలర్లు తిరుపతిలోని ఎంపీ నివాసంలో శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ప్రస్తుతం ఉన్న వైసీపీ పాలకవర్గం మారుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మదనపల్లె మున్సిపాలిటీలోనూ వైసీపీదే అధికారం వుంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, స్థానికంగా రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఇక్కడ కూడా అధికార మార్పిడి ఉంటుందనే ఊహాగానాలు అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు, నేతల్లో కొన్నిరోజులుగా ఊపందుకున్నాయి. ఈనేపథ్యంలో అప్రమత్తమైన వైసీపీ నేతలు..తమ పరివారాన్ని తిరుపతికి తీసుకెళ్లారు. ఎంపీతో కూర్చోబెట్టారు. హితబోధతోపాటు భవిష్యత్తులో తీసుకునే నిర్ణయంపై దిశానిర్దేశం చేశారు.

మహల్ హై స్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



మహల్ హైస్కూలు ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

కలికిరి, మే25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహల్ తెలుగు ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరానికి చెందిన ఎస్ఎస్‌సీవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అనుభవాలను పంచుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన సహచరులు తమ తమ కుటుంబాల వివరాలను తెలుసుకున్నారు. పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాస్ కార్యవర్గ సభ్యులకు సన్మానం



నూతన అధ్యక్షుడు గణపతి, రాధమ్మ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె, మే 25(ఆంధ్రజ్యోతి): ఏపీ బాస్ అధ్యక్షుడుగా ఎన్నికైన ఉలగ నాథన్ గణపతి, రాధమ్మ దంపతులతో పాటు కార్యవర్గ సభ్యులను ఆదివారం ఆదివారం మదనపల్లెలోని ఓ ఫంక్షన్ హాలులో ఆ పార్టీ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్, కర్నాటక ప్రభుత్వ జానపద అకాడమీ ఛైర్మన్ గొల్లపల్లి శివప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాయలసీమ నుంచి ఎన్నికైన 24 మంది సభ్యులను కూడా సత్కరించారు. కమిటీ సభ్యులు శ్రీనివాసులు, పల్లం తాతయ్య, నీరుగట్టి రమణ, ముత్యాల మోహన్, టీపీ పీర్ బాషా, ఉమాపతి, రమణయ్య, మద్దిలేటి ప్రమీల, ఆనంద్, దొరస్వామి, బాలకృష్ణ, మహేష్, విజయ్‌కుమార్, నరసింహ, వాసు తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక కిట్లు పంపిణీ



కార్యకర్తకు సభ్యత్వ నమోదు కిట్టు పంపిణీ చేస్తున్న శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, మే 25(ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ పార్టీ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జన సైనికులకు, కార్యకర్తలకు, వీర మహిళలకు భరోసా కల్పించే విధంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయం గర్వకారణమన్నారు. జనసేన కుటుంబ సభ్యులకు సభ్యత్వంతోపాటు ప్రమాదబీమా, జీవిత బీమా సౌకర్యం కల్పించిన మొట్టమొదటి రాజకీయ పార్టీగా జనసేన నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయిన జగదీష్, కుమార్, సల్మాన్, శంకర్, పవన్, కళ్యాణ్, మల్లికార్జున, సురేష్, రామ్మూర్తి, నవీన్, హసీని, జి.చంద్ర, నవాజ్, సోను, హర్ష, ఉమా, సత్య సాయి, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా యల్లమ్మ తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెద్దమండ్యం, మే 25 (ఆంధ్రజ్యోతి):గ్రామ దేవత యల్లమ్మ తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి భక్తులు దివ్వెలు, బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాల తో ఆలకరించారు. .కోర్కెలు తీరిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని అలంక రించి ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జనసేన పార్టీకి నామినేటెడ్ పదవి



దేపాని ప్రభాకర్

వాల్మీకిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వాల్మీకిపురం మండలంలో జనసేన పార్టీకి నామినేటెడ్ పదవి దక్కింది. జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు జర్రా వారి పల్లెకు చెందిన దేపాని ప్రభాకర్ మార్కెట్ కమిటీ డైరె క్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డెప్ప మాట్లాడుతూ జనసేన పార్టీకి నామినేటెడ్ పదవి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేపాని ప్రభాకర్ మాట్లాడుతూ నిబద్ధతతో ఉంటూ తన వంతు న్యాయం చేస్తానన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జి బెజవాడ దినేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

వేడుకగా దొడ్డిపల్లెమ్మ జాతర

కలకడ, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురంలో కొలువైన దొడ్డిపల్లెమ్మ జాతరను గ్రామస్థులు వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు చాందినీ బండిని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కుటుంబ సమేతంగా బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

డీవీఎంసీ సభ్యుడికి ఘనసన్మానం

పీలేరు, మే 25(ఆంధ్రజ్యోతి): 'బాస్' రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అన్నమయ్య డీవీఎంసీ సభ్యుడు పాలకుంట శ్రీనివాసులును శనివారం కర్ణాటక రాష్ట్ర జానపద అకాడమీ ఛైర్మన్ గొల్లహళ్లి శివ ప్రసాద్ ఘనంగా సన్మానించారు. మదనపల్లెలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో 'బాస్' వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటికి పిలుపు



మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్‌తో టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): మహానాడు బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్‌కు అధిష్టానం పిలుపునిచ్చింది. ఆదివారం మహానాడు మదనపల్లె పరిశీలకుడు, పెద్దకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలసి అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న దొమ్మలపాటి కార్యాలయానికి చేరుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె నుంచి 12 వేల మంది టీడీపీ కార్యకర్తలను తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనికి దొమ్మలపాటి సహకారం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన బాబు, నియోజకవర్గ పరిశీలకుడు ప్రసాద్, దొమ్మలపాటి యశశ్వీరాజ్, భవానిప్రసాద్, దేవరింటి శ్రీనివాసులు, మేకల రెడ్డిశేఖర్, మార్పురి వరుణ్, నిస్సార్, తదితరులు పాల్గొన్నారు.

మట్టిని కాపాడుదాం.. ప్రకృతి వ్యవసాయం చేద్దాం

- సామాజిక కార్యకర్త బైరి నరేష్



సమావేశంలో మాట్లాడున్న బైరినరేష్

నిమ్మనపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆదర్శంగా నిలవాలని సామాజిక కార్యకర్త బైరి నరేష్ పిలుపునిచ్చారు. ఆదివారం తవళం పంచాయతీలోని గుమ్మడి గంగులప్ప పొలంలో ఏర్పాటు చేసిన ఉచిత ధాన్యం పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనాల వినియోగంతో పలు రోగాలు వస్తున్నాయన్నారు. 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ గంగులప్ప ఆదర్శంగా నిలుస్తున్నాడన్నారు. ఆయన కృషిని గుర్తించిన ప్రభుత్వం ఆయనకు పలు పురస్కారాలు అందజేసిందన్నారు. అనంతరం దాదాపు 100 మంది రైతులకు గంగులప్ప ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన విత్తనపు వడ్లను ఒక ఎకరాకు సరిపడా నాలుగు కిలోలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, మోహన్‌బాబు, వినయ్, అచ్యుతరాజ్, యర్రయ్య, నరసింహులు, లక్ష్మన్న మహిళా రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యమ్మ, బోయకొండ గంగమ్మ జాతరలు



బోయకొండ గంగమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు



నల్లవీరగంగాభవానికి ఊంజల్‌సేవ

వాల్మీకిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండబోయనపల్లె గ్రామం కోటలో ఆదివారం సత్యమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, అర్చన చేశారు. అనంతరం సమీప గ్రామాల నుండి మంగళవాయిద్యాలు, దివిటీల నడుమ మహిళలు దీలు బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు.పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో బోయకొండ గంగమ్మకు మహిళలు దీలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల చెంత భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు.

కనుల పండువగా ఊంజల్ సేవ..

వాల్మీకిపురం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న నల్లవీర గంగాభవాని ఆలయంలో ఆదివారం సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త ముద్రంరెడ్డి రాంకుమార్‌రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆనందశెట్టి, రమణారెడ్డి, బలరామ్, అర్చకులు జనార్దన్‌స్వామి, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీ



పెద్దమండ్యం బస్టాండ్ ప్రాంతంలో కార్యకర్తలకు గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్నటీడీపీ నేతలు

పెద్దమండ్యం, మే 25(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో ఆదివారం యువనేత సుమన్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కుమ్మరవీధి, మాసాటీబీ వీధిలో గంగాధర, మహేశ్వర, హసీంసాబ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు విశ్వనాథరెడ్డి, సిద్దవరం ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 36 కేంద్రాల పరిధిలో సుమారు 5 వేల పైగా టీడీపీ సభ్యత్వం చేసుకున్నట్లు తెలిపారు.

టీడీపీ సభ్యత్వాలతో కార్యకర్తలకు భరోసా

తంబళ్లపల్లె: దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని సభ్యత్వ భరోసా తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు ఉందని తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర అన్నారు. ఆదివారం తంబళ్లపల్లె మండలంలో ఇటీవల సభ్యత్వ నమోదు చేసుకున్న టీడీపీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కార్యకర్తలకు అన్ని విధాలా ఆదుకోవాలనే ఆలోచనతో బీమా కల్పించారని తెలిపారు. కార్యకర్తలు ప్రమాదాలకు గురైనా, మరణించినా.. బీమా సౌకర్యం వర్తిస్తుందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుడి మహేష్, శివకృష్ణ, లోకేశ్వర్‌రెడ్డి, వికలాంగుల అధ్యక్షుడు రామాంజులు, టైలర్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేద్దాం

పెద్దతిప్పసముద్రం: ఈనెల 27,28,29న కడపలో తెలుగుదేశం పార్టీ తలపెట్టిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పెద్దతిప్పసముద్రం మండల కూటమినేతలు పిలుపునిచ్చారు. పెద్దతిప్పసముద్రం మండలం టీడీపీ కంచుకోటగా ఉందని, ఇక్కడ గ్రూపులు లేకుండా ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ సభ్యత్వ కార్డులను అందించి మహానాడు కార్యక్రమానికి ప్రతి కార్యకర్త హాజరు కావాలని కోరారు. బడుగు బలహీన వర్గాలకు మేలు జరగాలంటే అది ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యమన్నారు. పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరాలంటే అది ఒక్క టీడీపీకే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ రాము, పాలగిరి రామాంజులు, రామకృష్ణ, పాపన్న, ప్రదీప్, భజంత్రి రామచంద్ర, సాయి, గంగులప్ప సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

సంబేపల్లె, మే25(ఆంధ్రజ్యోతి): పంటసాగుకు రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తెలిపారు. ఆదివారం సంబేపల్లెలో రైతు సంఘం మండల కార్యకర్తల సమావేశం ఏరియా అధ్యక్షుడు వడ్డమూరి హరినాథనాయుడు అధ్యక్షతన జరిగింది. అనంతరం సంబేపల్లె మండల గౌరవ అధ్యక్షుడిగా అర్జున్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా రాజశేఖర్‌నాయుడు, కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రయ్యనాయుడు, రాజేంద్రనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా భాస్కర్‌రెడ్డి, పూ జారి కృష్ణ, బ్రహ్మానందరెడ్డి, కోశాధికారి వర్ల మధన్‌మోహన్‌లను ఎంపిక చేశారు.